# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 08 అక్టోబర్ 2024


## గొప్ప మనసును చాటుకున్న జిల్లా కలెక్టర్



**కడప, అక్టోబరు 7, ప్రభాతవార్త**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన వినతులు, ఫిర్యాదుల పట్ల తక్షణ సహాయ సహకారాలు అందిస్తూ తన గొప్ప మనస్సును చాటుకున్నారు జిల్లా కలెక్టర్. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో దువ్వూరు మండలం క్రిష్ణంపల్లెకు చెందిన భాగ్యలక్ష్మి తాను ఒంటరి మహిళనని, తనకు సపరేటుగా రేషన్‌కార్డు సదుపాయం కల్పించాలని, ఇప్పటికి ప్రభుత్వ రేషన్ కోటా తీసుకోలేకపోతున్నానని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. ఆమె పరిస్థితిని అర్థం చేసుకున్న జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందిస్తూ ప్రస్తుతం రేషన్‌కార్డు సపరేషన్ ఆప్షన్ లేదని, అప్పటి వరకు తన సొంత ఖర్చులతో బియ్యం, సరుకులు అందిస్తామని తెలిపారు. ఆ వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూము అధికారితో మాట్లాడి ఆమెకు రైస్‌పాకెట్, సరుకులు అందించారు. రేషన్‌కార్డు సపరేషన్ ఆప్షన్ జరిగేప్పుడు నూతన కలర్ రేషన్‌కార్డు తప్పకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాగా అర్జీదారుల పట్ల జిల్లా కలెక్టర్ చూపుతున్న మానవత్వం, ప్రత్యేక చొరవ, తక్షణ స్పందనపై అటు ప్రజలు, ఇటు అధికారులు ప్రశంసిస్తున్నారు.

## డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన



**కడప, అక్టోబర్ 7, ప్రభాతవార్త**

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన, సత్వర పరిష్కారం లభించింది. సోమవారం ఉదయం 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ నిర్వహించిన డయల్ యువర్ కార్యక్రమంలో మొత్తం 5 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలను విన్నవించారు. ఫిర్యాదులకు సంబంధించిన శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను జెసి ఆదేశించారు. ఆ సమస్యలలో కొన్ని పులివెందుల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయరెడ్డి, తొండూరు మండలం క్రిష్ణంగారిపల్లె నుండి 15కిలోమీటర్ల రోడ్డు మంజూరు అయి 6 నెలల కిందట రోడ్డు వేసి పూర్తి చేయక వదిలేశారని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కడప ఎర్రముక్కపల్లెకు చెందిన దస్తగిరిరెడ్డి రైతు బజారు నందు నాసిరకం టమోటాలు అమ్ముతున్నారని, దాని వల్ల నష్టం జరుగుతుందని, పైవారికి తెలిపిన ప్రయోజనం లేదని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దువ్వూరు మండల కేంద్రానికి చెందిన నాగిరెడ్డి తన ఆధీనంలో ఉన్న పట్టా భూమికి ఒక సర్వే నెంబరు బదులు వేరే సర్వే నెంబరు చూపుతున్నారని, తగు చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా కోరారు.

# బద్వేలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిలువుదోపిడి

: కార్యాలయంలో హల్‌చల్ చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

: ఈసీ, నఖలు పేరుతో భారీగా వసూళ్లు

: పెత్తనమంతా ప్రైవేటు సిబ్బంది కనుసైగల్లోనే

: ఏసీబీ దాడులలో పట్టుబడినా మారని వైనం

**బద్వేలు, అక్టోబర్ 7 ప్రభాతవార్త:**

బద్వేలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అంటే జిల్లాలోనే గుర్తింపు పొందిన కార్యాలయంగా పేరుంది. అనేకమార్లు ఈ కార్యాలయంపై ఏసీబీ దాడులు జరిగిన విషయం తెలిసిందే. అయినప్పటికీ కార్యాలయ వ్యవహారాలు మాత్రం యదాతదంగా కొనసాగుతుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. స్థలాలు, భూములు రిజిష్టర్ చేయించుకునేందుకు వెళ్లే వారి వద్ద సిబ్బంది నిలువు దోపిడి చేస్తున్నారు. చుట్టుపక్కల భూములకు రెక్కలు రావడంతో క్రయ, విక్రయాలు వేగంగా జరుగుతుండడంతో కారా్యలయంలో వారి పనులు చేసుకునేందుకు అడిగినంత ఇవ్వాల్సిందే. ఈ కార్యాలయంలో ప్రభుత్వ సిబ్బంది నలుగురు ఉంటే ప్రైవేటు వ్యక్తులు మాత్రం ఐదుమంది హల్‌చల్ చేస్తున్నారు. కార్యాలయంలో వారు చెప్పిందే వేదం. వారి పెత్తనం లేనిదే ఏ పనిజరగదు. ఎవరైనా ఈసీ, నకలు పేరుతో కార్యాలయానికి వస్తే వారి వద్ద నిలువుదోపిడి చేయడమే కాకుండా రోజుల తరబడి తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. ఐదుమంది ప్రైవేటు వ్యక్తులు కార్యాలయంలో పనిచేస్తున్నారంటే వీరందరికీ నెల జీతభత్యాలు ఎవరు ఇస్తారు, ఇదంతా ప్రజల నుంచి దోపిడిచేసి వారికి ఇవ్వడమేనా అని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఐదుమంది ప్రైవేటు వ్యక్తులు కార్యాలయంలో పని చేస్తుండడంతో అక్కడికి వచ్చే ప్రతి ఒక్కరూ వారి పెత్తనం చూసి అవాక్కవుతూన్నరు. గతంలో ఇలాంటి వ్యవహారం ఎక్కువ అవడంతో ఏసీబీ దాడులు చేసి ప్రైవేటు వ్యక్తులను తొలగించారు. ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించుకుని జీతాలు ఎలా ఇస్తారని ఏసీబీ గతంలో ప్రశ్నించి ప్రైవేటు వ్యక్తులను కార్యాలయంలోకి రానియవద్దని ఆదేశాలను జారీచేశారు. నేడు ఐదుమంది ప్రైవేటు వ్యక్తులు కార్యాలయంలో హల్‌చల్ చేస్తూ వారు చెప్పిందే వేదంగా కార్యాలయ వ్యవహారాలు నడుస్తున్నాయి. ఇదిలా ఉంటే క్రయ, విక్రయాలకు వచ్చేవారి వద్ద డిమాండ్లతో కూడిన డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీనిపైన



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గతంలో ఏసీబీ దాడి చేసి స్వయంగా కార్యాలయం సిబ్బంది వద్ద నగదు దొరకడంతో అనేకమందిపై చర్యలు తీసుకుని కార్యాలయంలో పనిచేసిన ప్రతి ఒక్కరినీ బదిలీ చేసిన విషయం విధితమే. నేడు యదావిధిగా కొనసాగుతోందని ఎలాంటి మార్పులు లేవని క్రయ విక్రయదారులు ఆవేదన చెందుతున్నారు. ఈ కార్యాలయంలో వారి పని జరగాలంటే అడిగినంత ఇవ్వాల్సిందే. లేకపోతే లేనిపోని కారణాలతో రిజిష్టర్లను పక్కనపెట్టడం జరుగుతుంది. ఎవరైనా ప్రశ్నిస్తే వారికి మాత్రం ప్రభుత్వ ఫీజును తీసుకుని వదిలేస్తారు. లేదంటే ఎంత కావాలనుకుంటే అంత వసూలు చేయడం జరుగుతుంది. మనుషులను బట్టి, వారి పనిని బట్టి వసూలు చేయడంలో ఈ కార్యాలయంలో సిబ్బంది పనితీరే సపరేటు. ఈసీ, నకలు కావాలంటే సంవత్సరాలను బట్టి ఎంత వసూలు చేయాలో అంత వసూలు చేస్తారు. మాములుగా అయితే ఈసీ, నకలుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్కవ నగదు తీసుకుని ఇవ్వాలి. కానీ ఇక్కడ వారు అడిగినంత ఇవ్వకపోతే బాధితులకు చుక్కలు చూపిస్తారు. ఏసీబీ దాడులు ఇన్నిసార్లు జరిగినా మార్పు రాలేదంటే వారు ఎన్నుకున్న మార్గానికి ఎవరు అడ్డు వచ్చినా వినేది లేదన్నట్లుగా మారారు.

## ఘనంగా వీరభద్ర స్వామికి అభిషేకాలు

పెరుగు వీరనారాయణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం



**చాపాడు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**

స్థానిక అల్లాడుపల్లె శ్రీ వీరభధ్ర స్వామి దేవస్థానం నందు దేవి నవరాత్రులలో భాగంగా సోమవారం వేకువ జాము నుండే అర్చకులు శ్రీ వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి దర్శణం కోసం ఇతర ప్రాంతాల నుండి కూడ భక్తులు పెద్దఎత్తున స్వామి వారి సేవలో తరించారు. అల్లాడుపల్లె గ్రామానికి చెందిన ఎం.ఎల్.ఎన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ మేనేజింగ్ డైరెక్టర్ పెరుగు వీరనారాయణ యాదవ్, సతీమణి పెరుగు లక్ష్మిదేవి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వీరభద్ర స్వామి అన్నదాన సత్రం యందు పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అన్నవరం సుధాకర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మేకల బాబు, గుత్తి వీరనారాయణ యాదవ్, అల్లాడుపల్లె వీరారెడ్డి, గోసుల కృష్ణారెడ్డి, ఎర్రమాచు వెంకటేశ్వర రెడ్డి, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



## అర్జీదారుల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

**రాయచోటి, అక్టోబరు 7, ప్రభాతవార్త:**



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నిర్ధిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రజలు తమ బాధలు చెప్పుకోవడానికి ఏకైక మార్గం ఈ వేదిక. ఈ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. సమస్య పరిష్కారానికి సంబంధించి ప్రతి శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) తరచుగా తమ శాఖకు సంబంధించి ఎలాంటి సమస్యలు వస్తాయి, దాని పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి, అది ఏ స్థాయిలో పరిష్కరించడానికి అవకాశం ఉందది, దరఖాస్తుదారులతో మాట్లాడాలి, క్షేత్ర స్థాయిలో విచారణ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. ఇందుకు నిర్ధిష్ట కాల పరమితి దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఒక వేళ కోర్టు పరిదిలో ఉంటే అందుకు తగిన చర్యలు తీసుకోవడం చేయాలి. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాలి. పెండింగ్ దరఖాస్తులు రీ ఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. సీఎం అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు.

## జిల్లాలో అవసరాలు, మన బలాలు, ఇంకా ప్రగతిలోకి తీసుకురావాల్సిన అంశాలపై రాత మూలకంగా సమర్పించవచ్చు

- స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళికలోజిల్లా నుంచి 1.11లక్షల సలహాలు
- రాబోయే రెండు రోజులే చివరి అవకాశం
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**రాయచోటి, అక్టోబరు 7, ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధికి, ఆలోచనలు, సలహాలు, సూచనలు స్వాగతిస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్వర్ణాంధ్ర-2047 జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పనలో భాగంగా రాబోయే ఐదు సంవత్సరాలు 2024-25 నుంచి 2028-29 వరకు అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి చేయడానికి గల అంశాలు, అవకాశాలు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు తదితరులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికలో భాగంగా రాష్ట్రాన్ని, జిల్లాలను అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు ఒక విజన్ ప్రణాళిక రూపొందించడానికి నిర్ణయించడం జరిగిందన్నారు. ఇప్పటికే దాదాపు 1.11 లక్షల మంది తమ ఆలోచనలు పంచుకున్నారని ఇంకా రెండు రోజులే గడువు ఉందని సలహాలు, సూచనలు చేయవచ్చున్నారు. 2047 విజన్‌లో పాలుపంచుకునేలా మీ గ్రూపులో క్యూఆర్ కోడ్ పంపించి ఎక్కువ మంది భాగస్వాములు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఎఫ్ఓ వివేక్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, ఆర్డీవో రంగస్వామి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రైతు గ్రూపులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వర్గాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## కూలీకి వెళ్లి.. కాటికెళ్లారు

- పిడుగుపడి ఇద్దరు మృతి, 9 మందికి గాయాలు
- బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్న మంత్రి



**రాయచోటి, అక్టోబరు 7, ప్రభాతవార్త:**

సంబేపల్లె మండలం, శెట్టిపల్లె గ్రామం దిగువ హరిజనవాడకు చెందిన 15 మంది వ్యవసాయ కూలీలు ఎస్.సోమవరం గ్రామంలో గుది సిద్దయ్య పొలంలో టమోటా పండ్లు కోసేందుకు కూలి పనులకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ప్రకృతి వైపరీత్యా భారీ ఈదురుగాలులతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ నేపథ్యంలో కూలీలపై పిడుగు పడడంతో ఇద్దరు మహిళా కూలీలు మల్లీశ్వరమ్మ(43), శంకరమ్మ(40) మృతి చెందగా మరో 9 మందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వివేక్ అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య కోసం కడపకు తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.





## డీఎఫ్ఓ వివేక్ జిల్లాకు చేసిన సేవలు మరువలేనివి



**రాయచోటి, అక్టోబరు 7, ప్రభాతవార్త:**

బదిలీపై వెళ్తున్న డీఎఫ్ఓ వివేక్ జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరితో పాటు పలువురు కొనియాడారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా డీఎఫ్ఓ వివేక్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వివేక్ సేవలను కొనియాడారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా తన సహాయ సహకారాలు అందించారన్నారు. చివరగా డీఎఫ్‌వో వివేక్ మాట్లాడుతూ జిల్లాలో తాను విధులు నిర్వర్తించిన కాలంలో జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలు అందించి తోడ్పాటు ఇవ్వడం జరిగతిందని ఇందుకు తను కృతజ్ఞతలు తెలుపుతున్నాన్నారు. అనంతరం డీఎఫ్‌వో వివేక్‌ను పూల మొక్కలు, శాలువాలతో కలెక్టరు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, రంగస్వామి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ పంట నమోదును పరిశీలించిన వ్యవసాయ అధికారి

**దువ్వూరు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని ఇడమడక గ్రామసచివాలయ పరిధిలో సోమవారం ఈ పంట నమోదును మండల వ్యవసాయ అధికారి అమర్‌నాధ్ రెడ్డి పరిశీలించారు. గ్రామాలలో వ్యవసాయ శాఖకు చెందిన సహాయకులు గతంలో ఈ పంట నమోదు చేసి ఉన్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు ఆదేశాల మేరకు ఈ పంట నమోదు సక్రమంగా జరిగిందా లేదా అనే విశయంపై పరిశీలన చేశారు. అందులో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ నిర్దేశించిన సర్వే నెంబర్లలో ఈ పంట నమోదును పరిశీలించాలని ఆదేశించారు. దీంతో ఈ పంట నమోదు చేసిన సర్వే నెంబర్‌ను అక్కడ పంట నమోదును సక్రమంగా చేశారా లేదా, వేసిన పంటనే చేశారా లేక ఇతర పంటను నమోదు చేశారా అనే విశాయలపై ఆయన పరిశీలించారు. వీటిని జిల్లా వ్యవసాయ శాఖకు పంపుతామని పేర్కొన్నారు. అలాగే అక్కడ సాగు చేసిన వరి, మొక్కజొన్న, జొన్న తోటలను పరిశీలించి రైతులకు పలుసూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యసాయ సహాయకులు సుబ్బిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఆ సెక్షన్‌లో వలసలెందుకు - అక్కడ జరుగుతున్న వేధింపులేంటి

**రాజంపేట,అక్టోబర్ 07,ప్రభాతవవార్త :**

మంగపేట ముగ్గురాయి పరిపాలనా కార్యాలయంలో ఏ సెక్షన్‌లకు సంబంధించి వలసలు ఎందుకు, అక్కడ జరుగుతున్న వేధింపులేంటో ఎవరికీ అంతుబట్టడం లేదు. ఒక్క రోజు కాదు, ఒక నెల కాదు, సంవత్సరం అంతకంటే కాదు, గత 3సంవత్సరాలుగా ఆ సెక్షన్ నుంచి పక్క సెక్షన్‌లోనికి వలసలు వచ్చేందుకు వారు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. వలసలు రావడానాకి సాదా సీదా పురుషులైతే ఏదో అనుకోవచ్చు కానీ అక్కడ పని చేసే మహిళా ఉద్యోగులే పక్క సెక్షన్‌లోనికి మార్చమని పరిపాలన విభాగంలో పెద్ద అధికారి చుట్టూ తిరుగుతూ అనేక బదిలీ కోసం ధరఖాస్తులను కూడా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే అధికారికి వీరు ఎందుకు వలసలు వస్తున్నారు. పక్క సెక్షన్‌లోనికి ఎందుకు అడుగుతున్నారక్కడ అంతుబట్టనట్లే తెలుస్తోంది. సాధారణంగా పరిపాలన విభాగంలో రకరకాల పలు విభాగాలకు సంబంధించి సెక్షన్‌లు ఉన్నాయి. ఒక్కో సెక్షన్ కు ఒక్కో అధికారిని కూడా నియమించడం జరిగింది. అన్ని సెక్షన్‌లలో సబబుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆ సెక్షన్‌లో మాత్రం అధికశాతం మహిళా ఉద్యోగులే ఉన్నారు. క్రింది స్థాయి ఉద్యోగుల పట్ల ఆ సెక్షన్‌కు సంబంధించిన అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి విధుల పట్ల శ్రద్ధ చూపాలి అయితే అక్కడ ఆ సెక్షన్ అధికారి వ్యవహరిస్తున్న తీరు పరిపాలన కార్యాలయంలోనే కాదు కార్మికులలో కూడా ముక్కున వేలేసుకోనే ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. మహిళల పట్ల ఆ సెక్షన్ అధికారి వ్యవహరిస్తున్న వేధింపులు తీరు వారు ఉద్యోగాలను వదలి వెళ్లిపోవాలనే దశ కూడా ఓ సమయంలో వచ్చిందనే అనుకుంటున్నారు. ఇక్కడ నుంచి వేరే సెక్షన్‌కు మారిస్తే



మేముబ్రతికి బయట పడడమే కాకుండా మానసికంగా విధులు నిర్వహించుటామని కూడా ఆ పరిపాలన పై అధికారికి విన్నవించుకున్నట్లు కూడా తెలుస్తోంది అయితే ఆ సెక్షన్‌లో సమస్య వేధింపులు అధికారికి తెలిసినప్పటికీ మీ సమస్యలేవని ఎందుకు ఆ సెక్షన్‌ను వద్దంటున్నారని కూడా ఆ మహిళా ఉద్యోగులను గట్టిగా నిలదీసి అడగలేకున్నట్లు వేధింపులకు గురౌతున్న ఆ మహిళా ఉద్యోగులు కూడా సమస్యను విప్పి చెప్పుకోలేని పరిస్థితులు ఉన్నట్లు కూడా తెలుస్తోంది. సెక్షన్‌లో పని చేసే అధికారి అతని పరిధిలో పని చేసే క్రింది స్థాయి అధికారి పట్ల బాధ్యతాయుతంగా పెద్దదిక్కుగా వ్యవహరించాల్సింది పోయి వారిని వేధించడం తిరగబడి ప్రశ్నిస్తే వెళ్లిపొమ్మనడం అవసరమైతే ఆ మహిళల మద్యే చిచ్చులు రేపి గొడవలు సృష్టిస్తున్నట్లు కూడా తెలుస్తోంది. ఆయన ముందే ఆ పరిపాలనా కార్యాలయంలో అవినీతి అధికారిగా ముద్ర వేసుకున్నట్లు కూడా తెలుస్తోంది. దీనికి తోడు మహిళా ఉద్యోగులను వేధించడం వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం వంటివి జరుగుతున్నప్పటికీ వేధింపులకు గురైన వారు పై స్తాయి అధికారికి సమస్యను విప్పి చెప్పుకోలేక అలాగని బయటకు పొక్కితే కుటుంభంలో కలహాలు ఏర్పడి ఎక్కడ సంసారాలు కూలిపోతాయోనని భయంతో గత 3 సంవత్సరాల నుంచి వారు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగున్నా అధికారి పసిగట్టినా కూడా అతనిపై చర్యలు తీసుకోకపోవడం ఆయనకున్న అండను చూసి భయమో అతను ఏ మేరకు దౌర్యన్యమంతుడో కూడా ఆ అధికారుల తీరు బట్టే చెబుతుంది. దీనిపై శాఖా పరమైన చర్యలు తీసుకొని ఆ సెక్షన్‌లో పని చేసే మహిళా ఉద్యోగులపై ఉద్యోగ, జీవిత బధ్రత కల్పించాలని కూడా వారు అధికారిని వేడుకున్నట్లు కూడా తెలుస్తోంది.

# బద్వేలులో వైభవంగా శ్రీ మత్కన్యకా పరమేశ్వరిదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు





**బద్వేలు అర్బన్, అక్టోబర్ 7 ప్రభాతవార్త :**
దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం బద్వేలు పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాలలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే.వి.సుబ్బారావు,గౌరవ అధ్యక్షులు పివిఎన్ ప్రసాద్, రాచపూడి సాయిక్రిష్ణ సెక్రటరీ కొలిశెట్టి నాగరాజు, ట్రెజరర్ చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలు సగళా సురేష్‌బాబు, వైభవ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మునగా చలమయ్య, దర్శి వెంకటేశ్వర్లు తో పాటు ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే వాసవి మాత అమ్మవారికి వివిధ రకాల విశేష పూజలు వేదపండితులు బోయలకుంట్ల సుబ్బనరసయ్య బృందం ఆద్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పలువురు భక్తులు, భక్తి, శ్రద్ధలతో వాసవిమాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రసాదాలన స్వీకరించారు. రాత్రి అన్నపూర్ణా దేవి అలంకారంలో వాసవిమాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక ఉభయదాతలుగా మాలేపాటి వెంకటసుబ్బారావు, సతీమణి విజయకుమారి, మాలేపాటి వెంకటసుబ్బారావు, సతీమణి లక్ష్మి సుజాత, మాలేపాటి కృష్ణమూర్తి ,సతీమణి వసంతలక్ష్మి, తల్లం విద్యాసాగర్ బాబు సతీమణి లక్ష్మినరసమ్మ, తాలేపల్లె మురళి మోహన్ క్రిష్ణ సతీమణి గీతాకు మారి, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి వెంకటసునీల్‌కుమార్ సతీమణి నవలత, వెంకట సురేంద్రకుమార్ సతీమణి లలిత కుమారి, వెంకట సురేష్‌బాబు, సతీమణి రూపా దేవి కుటుంబ సభ్యులకు ప్రత్యేక బ్యాండు మేళ తాళాలతో వారి స్వగృహం నుంచి అమ్మవారిశాలకు మర్యాదపూర్వకంగా ఆహ్వానించి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారిని దర్శించుకునేందుకు పట్టణ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చి వాసవిమాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్యవైశ్యవర్తక సంఘం సభ్యులు బచ్చు సుబ్రమణ్యం సతీమణి పార్వతిదేవి, తుమ్మలపెంట సురేష్‌బాబు, సతీమణి జయప్రదా దేవి, దొంతంశెట్టి కిశోర్‌కుమార్, సివి.నాగేశ్వరరావు, పసుపుల రవిశంకర్, దేవతి సురేంద్రబాబు, కోట శ్రీనివాసులు, చిందుకూరి సుధాకర్, పత్తి మస్తానయ్య, సుబ్రమణ్యం, పైడిమర్రి సురేష్‌బా బుతోపాటు పలువురు పగలు ఉభయదాతలుగా అమ్మవారి సన్నిది. లో వారికి ప్రత్యేక పూజలతో పాటుఅమ్మవారి ప్రసాదాలను అందిం చారు. ఈకార్యక్రమంలో కమిటి సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

**వాసవిఅమ్మవారిని దర్శించుకున్న ఆవోపా కమిటి:**
దసరా ఉత్సవాలలో భాగంగా ఆవోపా కమిటి అధ్యక్షులు నూకల రెడ్డెయ్య, సెక్రటరీ సి.వి. నాగేశ్వరరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పబ్బతి సత్యనారాయణ, చక్రపాణి, ట్రెజరర్ తులసి సుబ్రమణ్యంతోపాటు పలువురువాసవిమాత అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆవోపా కమిటి అధ్యక్షులు నూకల రెడ్డెయ్య మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆయన పలువురికి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## బ్లాకులో ఇసుక - భలే రేట్లు

### అధికారులకు మామూళ్లు - యజమానులకు భారాలు

**రాజంపేట,అక్టోబర్ 07,ప్రభాతవవార్త :**



బ్లాక్ మార్కెట్‌లో అక్రమ ఇసుక ధరలు అధికంగా భలే రేట్లు అమ్ముతున్నాయి. వీటిని అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు తెలుస్తోంది. అక్రమ ఇసుకాశూరులు అధికారులు చేతులు కలపడంతో ఇళ్లు నిర్మించుకునే యజమానులపై భారాలు బాగానే పడుతున్నట్లు తెలుస్తోంది. భయటి ప్రాంతం నుంచి రాత్రిల్లో ఇసుక, కంకర లను తరళించుకొని నిల్వ చేసుకుంటున్నారు. ముందే బయటి నుంచి ఇసుక, కంకర అధిక రేట్లకు అక్రమంగా తరలిస్తుంటే వీటిని కొనుగోలు చేస్తున్న అక్రమ ఇసుకాశూరులు గృహ యజమానులకు తెచ్చుకున్న దానికంటే అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ట్రాక్టర్ ఇసుక రూ.5వేలు టిప్పర్ ఇసుక రూ.18వేలకు కొనుగోలు చేసి వీరు గృహ యజమానులకు ట్రాక్టర్ రూ.8 నుంచి రూ.10వేలు టిప్పర్ ఇసుక రూ.23 నుంచి రూ.28వేలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ చేసుకునేందుకు లైసెన్సులు లేకుండానే సంబంధిత శాఖల అధికారులతో చేతులు కలపి వారికి మామూళ్ల మూట్ల జెప్పి వీరిద్దరి ఆధాయాలకు గృహ నిర్మాణ యజమానులపై అధిక రేట్ల భారం మోపుతున్నట్లు తెలుస్తోంది, ప్రభుత్వం ఇసుక అనుమతులు ఎప్పుడు ఇస్తుందో నని భవన నిర్మాణ యజమానులు, కార్మికులు ఎదురు చూస్తుంటే బ్లాకులో విక్రయించే అక్రమార్కులు వారికి సహకరించు అధికారులు ఇంకా కొద్ది రోజులు ఇలానే ఉంటే మా జేబులు నిండుతా యన్నట్లు యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమ విక్రయాలు ఎక్కడో కాకుండా కడప-చెన్నై హైవే రోడ్డుకు పక్కనే నిల్వ చేసి బోర్డులు పెట్టి అంగళ్లలో సరుకులు అమ్మినట్లుగా విక్రయిస్తుండడం అందరికీ ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. అయితే వాటిని నిరోధించి చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు మాత్రం మామూళ్ల దోచుకొని కప్పను మింగిన పాముల్లా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం మరీ దారుణంగా ఉంది. ఈ అధికారుల అండతో రైల్వే కోడూరు, రాజంపేట పట్టణాల్లో అక్రమార్కులు హైవే రోడ్డు పైనే విక్రయించి అధికంగా దోచుకుంటున్నట్లు తెలుస్తోంది.

### ప్రజలను తప్పుదోవ పట్టించే

## రాజకీయాలు చేయడమే చంద్రబాబు నైజం

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**



రాష్ట్రంలో జరిగిన గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేక హామీలను అమలు చేయడంలో విఫలమై ఎక్కడ ప్రశ్నిస్తారోనన్న భయంతో ప్రజలను తప్పు దోవ పట్టించే రాజకీయాలు చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నైజం అని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ ఇచ్చినది పదవి కాదని బాధ్యత అని భావించి రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలులో లోపాలను ఎండగట్టి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వైసీపీ అధికార ప్రతినిధిగా ప్రజల గొంతుకనై ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఒక్క పింఛన్ తప్ప ఇచ్చిన హామీలు ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. ఇటీవల విజయవాడ వరద పాలు కావడానికి సీఎం చంద్రబాబు కారణం అని విమర్శించారు. వరదలకు కారణం అయిన చంద్రబాబు కనీసం వరద బాధితులకు సంరక్షించడంలో పూర్తి వైఫల్యం చెందారని దుయ్యబట్టారు. కొవొత్తులకు 26 కోట్లు, పులిహోర ప్యాకెట్లకు 360కోట్లు ఖర్చు అంటూ మోసం చేస్తున్న వైణాన్ని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి చిన్నారులపై, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తారంట భయంతో ప్రజలను తప్పు దోవ పట్టించే విధంగా రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల మనసులలో ఉదో ఒక తప్పుడు అంశాన్ని ప్రచారం చేసి ప్రజలలో విశ బీసం నాటి వారిని అయోమయంలో పడవేసే రాజకీయాలు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. తెలంగాణలో హైదరాబాద్, ఏపీలో తిరుపతి లడ్డు వ్యవహారం తెరపైకి తెచ్చి దుష్ప్రచారం చేయడమే చంద్రబాబు నైజం అన్నారు. తిరుమల లడ్డులో ఎలాంటి కల్తీ జరగలేదని తిరుమలకు చెందిన ఈఓ ప్రకటించినా బాధ్యత గల ముఖ్యమంత్రిగా కల్తీ జరిగిందని ఎలా ప్రకటిస్తారని ఇటీవల సుప్రింకోర్టు ప్రశ్నించిన సంగతిని ఆయన గుర్తు చేశారు. ఎన్ని రోజులు హామీలు అమలు చేయకుండా తప్పుదోవ పట్టించే రాజకీయాలు చేస్తారని చంద్రబాబును ఆయన నిలదీశారు. నాలుగు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం గ్రాఫ్ పడిపోవడం ఈ దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగలేదని అన్నారు. లడ్డు వ్యవహారంలో చంద్రబాబు దేశ ప్రజలనేకాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారని విమర్శించారు. లడ్డు ప్రసాదం వ్యవహారంలో చంద్రబాబు తన తప్పుడు ప్రచారంలో అభాసుపాలయ్యారని అన్నారు. చంద్రబాబు జీవితం అంతా తప్పుడు ప్రచారాలతో అపవిత్రంగానే మిగిలారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన వాగ్దానాలు ప్రజలకు లబ్ది చేకూరేంత వరకు వైసిపి పోరాడుతూనే ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీముని పల్లె లక్ష్మీదేవి నాగరాజు, కౌన్సిలర్లు ఎంవి సుబ్బారెడ్డి, గుర్రం లావణ్య, భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, వైసీపీ నాయకులు డీలర్ గంజికుంట ఆంజనేయులు, శివకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం దుకాణాల కోసం

# దరఖాస్తులు ఆహ్వానం

**పీలేరు, అక్టోబరు 07 ప్రభాతవార్తః**



ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీలేరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పీలేరు సర్కిల్ పరిధిలోని పీలేరు మండలం-6, కలకడ-2, కేవి.పల్లె-1 మొత్తం 9 మద్యం ఔదుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తు గెజిట్ నోటిఫికేషన్ జారీచేయడం జరిగిందన్నారు. దరఖాస్తులు ఈనెల 9వ తేదీ సాయంత్రం 5గంటల లోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో రూ.2లక్షలు నాన్ రీఫండబుల్ రిజిస్ట్రేషన్ చార్జిగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక వ్యక్తి ఒక షాపుకు ఎన్ని దరఖాస్తులైనా దరఖాస్తులు సమర్పించవచ్చునని ఒక వ్యక్తి లాటరీలో ఒక వ్యక్తి ఎన్ని షాపులైనా దక్కించుకోవచ్చునని చెప్పారు. లాటరీ ప్రక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి అపోహలకు తావు లేకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రకారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈనెల 11న రాయచోటి- చిత్తూరు మార్గంలోని లయ గార్డెన్సు, పుష్యమి గ్రూప్ ఆఫ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించబడుతుందన్నారు. ఒక వేళ దరఖాస్తు సమర్పించుటకు లేదా లాటరీ ప్రక్రియ రోజుగానీ అభ్యర్థి రాలేని పక్షంలో ఒక అఫిడవిట్ సమర్పించి అతని తరపున వేరే వ్యక్తిని పంపవచ్చని పేర్కొన్నారు. కావున ఆసక్తిగల అభ్యర్థులు మద్యం షాపుల కోసం దరఖాస్తులు సమర్పించవలసిందిగా కోరారు.

## మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**సిద్దవటం, అక్టోబరు 7, ప్రభాతవార్త:**



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సిద్దవటం మండలం ఉప్పరపల్లె గ్రామం సాయినగర్‌లో 5వ రోజు సోమవారం మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవవారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తతీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విగ్రహ దాత పుత్త రామచంద్రయ్య కుమారులు పుత్త బాబు, నాగభూషణం వారి కుటుంబ సభ్యులు అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుత్త బాబు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా దసరా వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని ప్రతి కుటుంబంలో అమ్మవారి అనుగ్రహం ఉండి వ్యాపార, ఉద్యోగ, పంట పొలాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

## లలితా దేవి అలంకారంలో వాసవి మాత

**దువ్వూరు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**



దువ్వూరులోని అమ్మవారి శాల వీధిలో వెలసి ఉన్న శ్రీ మరకత వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు సోమవారం వన విహారిని లలితా దేవి అలంకారంలో శ్రీ వాసవి మాత భక్తులకు దర్శణం ఇచ్చింది. ఈ సంధబ్బంగా వాసవీమాత తోట ఉత్సవంలో భాగంగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నుండి బయలుదేరి వనవిహారిని అలంకారంలో పాత వువ్వూరులో ఉన్న శ్రీ గంగా భవాని ఆలయానికి ఊరేగింపుగా తీసుకువెల్లారు. అక్కడ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

## యర్రగుంట్లలో అన్నా క్యాంటీన్ ప్రారంభం

**యర్రగుంట్ల, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన పేద ప్రజల ఆకలి బాధలను తీర్చడానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నా క్యాంటీన్ సోమవారం సాయంకాలం యర్రగుంట్ల పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ వెనుక జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టిడిపి ఇంచార్జ్ భూపేష్ రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీఓ ఆదిమూలం సాయి శ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఎర్రగుంట్లలో అన్నాక్యాంటీన్ పున: ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గత నాలుగు నెలల నుంచి జమ్మలమడుగు నియోజకవర్గానికి కేంద్రం నుంచి కోట్లాది రూపాయల నిధులను అభివృద్ధి కోసం తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇది గమనించకుండా వైకాపా వారు కూటమి ప్రభుత్వమే నిందలు వేయడం తగదు అన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ నిర్మూళనకు జాబ్ మేళాలో ఆరోగ్యం కోసం ఆరోగ్య క్యాంపులు తరచుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యర్రగుంట్ల మండల ఇన్చార్జి మధుసూధన్ రెడ్డి మరియు రాజగోపాల్ రెడ్డి, యర్రగుంట్ల బీజేపి మండల ఇన్చార్జి మేకల జగన్‌మోహన్ రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులు హరి ఓబుళ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కోవటం నారాయణ రెడ్డి, ఎస్.జగన్ రెడ్డి వందలాది మంది కార్యకర్తలతో పాల్గొన్నారు.

## తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన సరస్వతి

**చెన్నూరు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**



చెన్నూరు మండల తహసీల్దారుగా సరస్వతి సోమవారం బాధ్యతలు స్వీకరించం జరిగింది. చెన్నూరు నందు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జీవన్ చంద్రశేఖర్ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లడం జరిగింది. ఖాజీపేట మండలంలో తహసీల్దారుగా విధులు నిర్వహిస్తూ ఉన్న సరస్వతి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈమె గతంలో కమలాపురం తహసీల్దారుగా విధులు నిర్వహించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## ద్వాక్రా వెలుగు శాఖల్లో చీకటి అవనీతిని బయటకు తీస్తాం

**పెనగలూరు, అక్టోబర్07,ప్రభాతవవార్త :**



మండలంలోని ద్వాక్రా వెలుగు శాఖల్లోని చీకటి అవనీతిని బయటకు తీస్తామని సిపిఐ నాయకులు గానుగపెంట ఆదినారాయణ అన్నారు. ఈ సందర్భంగా వారు మండలంలోని కట్టావారిపల్లె పంచాయితీలో ద్వాక్రా మహిలలతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ 2016వ సంవత్సరం ప్రభుదాస్ అనే ద్వాక్రా వెలుగు అవనీతికి పాల్పడి రూ.15లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించామన్నారు. అంతేకాకుండా ఆ డబ్బంతా ఒక యానిమేటర్ యానాదయ్య పేరుమీద మోపుతున్నట్లు తెలిపారు. ఒక అనిమోటర్ కనీసం 4వ తరగతి చదివిన వారికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. చదువు రాని వారిని అంటిపెట్టుకొని వారికి అనుకూలంగా చేసుకొని రూ.15లక్షలు స్వాహా చేశారని అందుకు సహకరించిన వెలుగు అధికారులే అని తెలిపారు. అందులో బాగంగా వెలుగు శాఖలో ఎని మండల అధికారి కట్టావారిపల్లెను పరిశీలించే సిసి లు కలసి ఆ పంచాయితీలో లెక్కులు చూసి అవి కొమ్మగిరి యానాదయ్య వాడుకున్నట్లు తెలివిగా చెబుతున్నారని తెలిపారు. అంతటితో ఆగకుండా ఆ గ్రామ పంచాయితీ లోని సుమారు 30 పొదుపు సంఘాల వారికి ఈ సంగతి తెలియగానే యానాదయ్య మీద ఒత్తిడి పెంచుతున్నట్లు తెలిపారు. అంతేగాకుండా మండల వెలుగు అధికారులు కూడా రూ.15లక్షలు చల్లించకపోతే పోలీసులు చేత అరెస్టు చేయిస్తామని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని అతనిని బెదరించడం మంచిది కాదని నిరుపేద దళిత కుటుంబానికి చెందిన అతను ఏవిధంగా కడతాడని ప్రశ్నించారు. ఈ కార్యక్రమమంలో సిపిఐ సహాయ కార్యదర్శి ఈరి లక్ష్మీ నారాయణ మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ రూములకు ప్రీపెయిడ్ కరెంటు మీటర్లు

**పులివెందుల, అక్టోబరు 7, ప్రభాతవార్త ః**
పులివెందుల పట్టణంలోని మున్సిపాలిటీ రూములకు ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లను అధికారులు అమరుస్తున్నారు. ఇందులో భాగంగా పులివెందుల పట్టణంలోని మహిళామార్ట్ క్రింది వైపు ఉన్న రూములకు ఈ విద్యుత్ మీటర్లను సోమవారం అమర్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పైలెట్ ప్రాజెక్టులో భాగంగా వీటిని అమరుస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనంలో ఉండే వాటికి మాత్రమే వీటిని అమరుస్తున్నట్లు తెలిపారు.



## వీరభద్ర స్వామి అలంకారంలో స్వామివారు




**బద్వేలు అర్బన్, అక్టోబర్ 7 ప్రభాతవార్త :**
పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో సోమవారం రాత్రి వీరభద్ర స్వామి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటి ధర్మకర్త ప్రొద్దుటూరు కిశోంకుమార్, అధ్యక్షులు దేవతి సురేంద్ర,సెక్రటరీ ఇమ్మడిశెట్టి సత్యనారాయణల ఆధ్వర్యంలో వేదపండితులు ఒరుగంటి సీతారామశాస్త్రి, ప్రసాద్(అప్పి) తో పాటు మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేకం, సహస్రనామార్చనతో పాటు పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా దేవతి వెంకటసుబ్బారావు, సతీమణి ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షరాలు లలిత,అలాగే పిన్నుపోలు సునీల్‌కుమార్, సతీమణి బేబి సిందూరి, కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీలు చిప్పగిరి ఆంజనేయులు, దేవతి సుధాకర్, ట్రెజరర్ దేవతి మల్లికార్జున,వైస్ ప్రెసిడెంట్లు ఓబుళశెట్టి చిన్న సుబ్బరాయుడు, తిరువీధి లక్ష్మణరావు, వడ్లపూటి నాగభూషణం, యువజన సంఘం అధ్యక్షులు చిన్న సత్యనారాయణ, వైస్ ప్రసిడెంట్ సాయి కార్తీక్, గౌరవాధ్యక్షులు పత్తి సాయి పవన్, అడ్వయిజర్ మిట్టా సాయికుమార్, కొప్పరపు తరుణ్, ట్రెజరర్ ఒరుగంటి సాహస్ మిత్ర తో పాటు పలువురు కమిటి సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

## బద్వేలు ఎంపీడీవో గా మల్లేశ్వరి బాధ్యతలు

**బద్వేలు రూరల్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:**



బద్వేలు ఎంపీడీవోగా సోమవారం దుంపల మల్లేశ్వరి బాధ్యతలు చేపట్టారు. వీరబల్లి మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మల్లేశ్వరి సాధారణ బదిలీలలో భాగంగా బద్వేలు ఎంపీడీవోగా చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి దుంపల మల్లేశ్వరి మాట్లాడుతూ బద్వేలు మండల పరిధిలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కరించేలా కృషిచేస్తామన్నారు.

## పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి

**గోపవరం, అక్టోబర్ 7 ప్రభాతవార్త :**



మండల పరిధిలోని పీపీకుంట వద్ద గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వెంకటేష్ పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం తహశీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలు నివాసం ఉంటున్న ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని, ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు సృష్టించుకుని అసైన్‌మెంట్ కమిటి ఆమోదం లేకుండా కోట్ల రూపాయలు విలువైన స్థలాలు స్వాధీనం చేసుకున్నారని ఆ స్థలాలను ప్రభుత్వ రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నరసింహ, కదరయ్య, లావణ్య, శుభలక్షుమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవు

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:**



వాహనదారులు ఎవరైనా రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు, సోమవారం సీఐ ఆదేశాల మేరకు ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన పలువురు వాహనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని, అలాగే డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవన్నారు. అలాగే పత్రాలు లేని, డ్రైవింగ్ లైసెన్స్‌లేని కొందరికి జరిమానా విధించారు. ఈ వాహనాల తనిఖీలో పోలీసు సిబ్బంది నరసింహులు, లక్ష్మినరసయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:**
మున్సిపాలిటీ పరిదిలో జరుగుతున్న పలు పారిశుద్ధ్య పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా కోటిరెడ్డి నగర్ వద్ద అస్తవ్యస్తంగా ఉన్న కంపచెట్లు, డ్రైనేజీ తదితర పారిశుద్ధ్య సమస్యలను ఆయన దృష్టికి స్థానికులు తీసుకు రాగా జేసీబీ సహాయంతో కం పచెట్లు తొలగించి డ్రైనేజీ పూడిక తొలగించారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

## జూదం ఆడుతూ ఏడుమంది అరెస్టు

**బద్వేలు, అక్టోబర్ 7 ప్రభాతవార్త:**
పట్టణంలోని మహమ్మద్ కాలనీలో గల ఫారెస్టు కార్యాలయం వెనుకవైపు మంగతాయి జూదం ఆడుతున్న ఏడుమందిని అదుపులోకి తీసుకున్నట్లు అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు. తమకు రాబడిన సమాచారం మేరకు వీరిని అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద నుంచి రూ.32,600లు నగదుతోపాటు 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ దాడులలో ఎస్ఐ రవికుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సుదర్శన ఆశ్రమంలో కన్నుల పండువగా దసరా ఉత్సవాలు

**గోపవరం , అక్టోబర్ 7 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మడకలవారిపల్లెలో గల సుదర్శన ఆశ్రమంలోని శ్రీరాజరాజేశ్వరి దేవి ఆలయంలో సుదర్శన స్వామి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికిరోజువారి కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. అలాగే ఈ నెల 11వ తేది మహర్నవవి సందర్భంగా చండిహోమం అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని, అలాగే 12వతేది విజయదశమి రోజున శమి దర్శనంతో పాటు గుడి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## అభివృద్ధి పథంవైపు నడవాలి

**పులివెందుల, అక్టోబరు 7, ప్రభాతవార్త ః**
స్వయం సహాయ సంఘాలు అభివృద్ధి పథంవైపు నడవాలని మెప్మా సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి, సీవోలు రామాంజనేయులు, నాగలక్ష్మిలు అన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 2047 స్వయం సహాయ సంఘాల సభ్యుల అభివృద్ధికి యాక్షన్‌ప్లాపై అధికారులు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సంఘాలలోని మహిళలు అభివృద్ధి ఏ విధంగా సాధించాలి, అందుక ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై సమగ్రంగా చర్చించారు. అలాగే బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి ఎలా కట్టించాలి, వారి అభివృద్ధికి బ్యాంకుల నుండి ఏ విధంగా రుణాలను మంజూరు చేయించాలి తదితర అంశాల గురించి వివరించారు. 2047 సంవత్సరానికి యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా ఈ సంఘాలు ఎలా అభివృద్ధి చేయాలి, ఏ స్థాయిలో ఉండాలి అన్న అంశాలను పరిగణలోకి తీసుకుని యానిమేటర్లకు శిక్షణ ఇచ్చారు.





ముద్దనూరులో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు శరన్నవ రాత్రులలో భాగంగా సోమవారం 5వ రోజు శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారంలో భక్తులకు దర్శణం ఇవ్వడం జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారు ఆశీర్వాదం పొందారు.

## పేరు మార్పు

షేక్ బాదుల్లా భాష (పాతపేరు) తండ్రి షేక్ ఖాదర్ మొహిద్దిన్ అడ్రస్ 14-142, మిద్దెపైన, దస్తగిరిపేట వీధి, ప్రొద్దుటూరు టౌన్, (మం.) కడప జిల్లా. ఏ.పి., వేంపల్లి అహ్మద్ భాష (కొత్తపేరు)గా మార్చుకోబడినది. కావున గమనించగలరు.

## విధాత రాసిన విషాదం...

### రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

రాజంపేట అర్బన్, అక్టోబర్ 07, ప్రభాతవార్త:
ఆ దంపతులకు ఇద్దరు కుమారులు. రెండో కుమారునికి ఆరోగ్యం బాగలేక పోవడంతో రాజంపేటకు తీసుకువచ్చారు. అనంతరం తండ్రి, పెద్దకుమారుడు మోటార్ బైక్‌పై తిరిగి ఇంటికి వెళుతుండగా ప్రమాదవశాత్తు మోటార్ బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో బాలునికి తీవ్ర రక్తస్రావమై మరణించిన విశాధ సంఘటన రాజంపేటలో సోమవారం జరిగింది. ఓబుళవారి పల్లె మండలం చిన్న ఓరంపాడుకు చెందిన బాబు రావు, శిరీష దంపతులకు శ్యాం పెద్దకుమారుడు కాగా, చిన్న కుమారునికి ఆరోగ్యంగా బాగా లేకపోవడంతో ఓ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. తల్లి చిన్న కుమారుని వద్దనే ఆస్పత్రిలో ఉంది. బాబు రావు పెద్ద కుమారుడు శ్యాంను మోటార్ బైక్‌పై కూర్చొబెట్టుకొని ఇంటికి వెళుతుండగా ప్రమాదవశాత్తు బైక్ స్కిడ్ అయింది. ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో శ్యాం తలకు గాయమైంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శ్యాంను చూసి అప్పటికే మరణించినట్లు తెలిపారు. కన్న కొడుకు కళ్లెదుటే మృతి చెందడంతో ఆటు బాబు రావ్‌ను, రెండో కుమారుడు బాగ లేక ఆస్పత్రికి వచ్చి పెద్దకుమారున్ని పోగొట్టుకున్న శిరీషను ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. పేగు బంధం ఆ తల్లిని కన్నీటి పర్యంతం చేసింది. ఈ ప్రమాదంతో బాబురావ్ కుటుంబంలో విశాదం నెలకొంది.

## మోహినీదేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరి

రామాపురం, అక్టోబరు 7, ప్రభాతవార్త:

మండలంలోని నీలకంఠరావుపేట సమీపంలో శరన్నవరాత్రి దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం మోహినీదేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు పూజలు, అభిషేకాలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### పార్వతీదేవి అలంకారంలో దర్గా మాతాజీ

మండలంలోని దర్బార్ సాయి నగర్‌లోని అనంత ఆశ్రమంలో సోమవారం బిల్వవృక్ష నివాసి దేవిగా దర్గా మాతాజీ భక్తులకు దర్శనమిచ్చారు. మాతాజీకి అభిషేకాలు, తీర్థ ప్రసాదాలు, శ్రీచక్ర పూజలు చేశారు.

## ఈవోపీఆర్డీగా పట్నాయక్

రామాపురం, అక్టోబరు 7, ప్రభాతవార్త:
రామాపురం మండల పంచాయతీ విస్తీర్ణ అధికారిగా పట్నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన లక్కిరెడ్డిపల్లె మండలంలో ఈవోపీఆర్డీగా పని చేస్తూ బదిలీపై రామాపురానికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఉషారాణి లక్కిరెడ్డిపల్లె ఈవోపీఆర్డీగా బదిలీ అయ్యారు.

## కలికిరి పంచాయతీ ఈవోగా అశోక్ బాధ్యతల స్వీకరణ

కలికిరి, అక్టోబరు 7, ప్రభాతవార్త:

కలికిరి మేజర్ పంచాయతీ ఈవోగా సోమవారం జి.అశోక్ బాధ్యతలు స్వీకరించారు. కలికిరి పంచాయతీ ఈవోగా విధులు నిర్వహిస్తున్న గురుమోహన్‌ను పీలేరు పంచాయతీ ఈవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో కలికిరి పంచాయతీ ఈవోగా అశోక్‌ను ప్రభుత్వం నియమించడంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను కలికిరి మేజర్ పంచాయతీ దివంగత సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్‌రెడ్డి తనయుడు రెడ్డివారి యోగేష్‌రెడ్డి పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఈవో అశోక్‌ను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

## పంచాయతీరాజ్ శాఖ డీఈగా మధుసూదన

కలికిరి, అక్టోబరు 7, ప్రభాతవార్త:

పీలేరు సబ్ డివిజన్ పంచాయతీరాజ్‌శాఖ డీఈగా మధుసూదన బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఈగా విధులు నిర్వహించిన భాస్కర్‌ను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఆయన స్థానంలో మధుసూదనను డీఈగా నియమించిది. దీంతో ఆయన డీఈగా బాధ్యతలు స్వీకరించి సోమవారం కలికిరి ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. అలాగే పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారిని డీఈ ఆదేశించారు. డీఈగా బాధ్యతలు చేపట్టిన మధుసూదనను సిబ్బంది పుష్పగుచ్చం ఇచ్చి సన్మానించి స్వాగతం పలికారు.

## గ్రీవెన్స్‌డేలో పలు రెవెన్యూ సమస్యలు పరిష్కారం

కలికిరి, అక్టోబరు 7, ప్రభాతవార్త:

కలికిరి తహసీల్దారు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే లో తహసీల్దారు మహేశ్వరీభాయ్ పలు రెవెన్యూ సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరించారు. అధిక సంఖ్యలో రైతులు, మహిళలు రెవెన్యూ సమస్యలపై తహసీల్దారుకు అర్జీలు అందించారు. సమస్యలు తెలుసుకున్న తహసీల్దారు తమ రెవెన్యూ సిబ్బందిని పిలిపించి కొన్ని సమస్యలు పరిష్కరించారు. మరికొన్నింటిని తమ సిబ్బందిని పంపి సమగ్ర విచారణ జరిపి సమస్యలు పరిష్కరిస్తామని లబ్ధిదారులకు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా రెవెన్యూ సమస్యలుంటే తమను సంప్రదించాలని దళారులను నమ్మద్దని మండల ప్రజలకు సూచించారు. ఇప్పటికే మండలంలో ఫ్రీ హోల్డ్ రీ సర్వే 90% పూర్తి కావడం జరిగిందన్నారు. ఎక్కడైనా ప్రజలకు, రైతులకు ఏవైనా సర్వేపై సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలన్నారు.

## దళిత రైతుల కుటుంబాలకు న్యాయం చేయండి మహాప్రభో

సిద్దవటం, అక్టోబరు 7, ప్రభాతవార్త:
సిద్దవటం మండలం మాధవరం మేజర్ గ్రామ పంచాయతీ ఎస్.కె. ఆర్.నగర్‌కు చెందిన దళిత రైతు కుటుంబాలకు చెందిన మహిళలు సర్వే నెంబరు 937లో మాకు సాగు భూమికి అసైన్ కమిటీలో కూడా 75 ఎకరాల భూమి కేటాయించారని ఇటీవల జరిగిన రెవెన్యూ, ఫారెస్టు శాఖలకు సంబంధించిన భూములు సర్వేలలో మా భూములు పోకుండా మాకు న్యాయం చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఆర్డీవో జాన్ ఎర్విన్, పాలపర్తి మండల తహసీల్దారు మురాద్‌షావలీలను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం దళిత రైతులు మాట్లాడుతూ పై సర్వే నెంబరులో 75 ఎకరాలు భూమి కేటాయించి మాకు సాగు చేసుకోమని అధికారులు నిర్ణయించినా కొంత మంది తరచూ మా భూములు మాకు చెందకుండా అడ్డుపడుతున్నారని మా దళిత రైతు కుటుంబాలపై విష ప్రచారాలు చేస్తూ ఉన్నారని వారి నుంచి తమకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నామన్నారు. కొన్ని సంవత్సరాలుగా మేము ఉపాధి హామీ పనులకు వెళ్లి జీవనోపాధి పొందుతున్నామని మాకు అసైన్ కమిటీలో మంజూరైన పాసైన భూములు మాకు మంజూరు చేయాలని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, పార్లమెంటు వాణిజ్య కార్యనిర్వహణ కార్యదర్శి ఎన్నార్‌రై చంద్ర, మాజీ సర్పంచ్ గాలి ఓబయ్య, దళిత రైతు కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.



## వృద్దులకు అన్నప్రసాదం



సిద్దవటం, అక్టోబరు 7, ప్రభాతవార్త:
సిద్దవటం మండల విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తూ వి.ఎన్.పల్లె మండలానికి బదిలీ కావడంతో సోమవారం పరమాత్మ సేవా ఆశ్రమంలో వృద్దులకు అన్న ప్రసాదం సమకూర్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, వీఆర్వో రేణుక,గ్రామ పంచాయతీ సెక్రటరీలు ఉప సర్పంచ్ నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, ఈవోపీఆర్డీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విస్తరణాధికారి పులి రాంసింగ్ మాట్లాడుతూ బదిలీ అనేది ప్రతి ఉద్యోగికి తప్పని సరి అన్నారు. పరమాత్మ సేవా ఆశ్రమంలో మా కుటుంబం తరుపున వృద్దులకు అన్నప్రసాదం సమకూర్చడం ఇది దేవుడు మాకు ఇచ్చిన వరంగా భావిస్తున్నానని ప్రతి ఒక్కరూ వృద్దులకు అన్న ప్రసాదాలు సమకూర్చాలని ఆయన కోరారు. తనకు సహకరించిన మండల ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## డిప్యూటీ తాసిల్దార్ గా శిరీష

అట్లూరు,అక్టోబర్ 7,ప్రభాతవార్త:

అట్లూరు మండల డిప్యూటీ తాసిల్దార్ గా శిరీష నూతన బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ తాసిల్దార్ రవిశంకర్ బదిలీ పై కాశినాయన మండలానికి వెళ్లగా పులివెందుల డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేస్తున్న శిరీష బదిలీ పై అట్లూరుకు వచ్చేశారు. అనంతరం బదిలీ పై వెళుతున్న ఇంచార్జ్ తాసిల్దార్ రవిశంకర్ ను కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## వనవిహారిణి దేవి అలంకారంలో వాసవిమాత



పులివెందుల, అక్టోబరు 7, ప్రభాతవార్త ః
పులివెందులలో వెలసిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారు సోమవారం సాయంత్రం వనవిహారిణి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సభ్యులు వైభవంగా నిర్వహిస్తున్నారు. వనమహోత్సవం సందర్భంగా ఆలయాన్న రకరకాల మొక్కలు, పుష్పాలతో అందంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రవికుమార్ శ్రేష్ఠి, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోండి



పులివెందుల రూరల్, అక్టోబరు 7, ప్రభాతవార్త ః
రాష్ట్ర ప్రభుత్వం రైతు సోదరులకు సబ్సిడీ ద్వారా అందించే డ్రిప్, స్పింక్లర్ పరికరాలను వేముల మండలంలోని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని వేముల మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి కోరారు. సోమవారం మెగా కంపెనీ ఆధ్వర్యంలో సబ్సిడీతో అందిస్తున్న డ్రిప్ పరికరాలను రైతులకు అందించారు.

## ఎంపీడీగా బాధ్యతలు చేపట్టిన పులిరాంసింగ్



వీరపునాయునిపల్లె, అక్టోబరు 7, ప్రభాతవార్త ః
వీరపునాయునిపల్లె ఎంపీడీవోగా పులిరాంసింగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని సిబ్బందిని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల సెక్రెటరీలు, తదితరులు ఎంపీడీవోను కలిసి సన్మానించారు.

## మద్యం షాపులో చోరీ - రూ.5.9లక్షలు అపహరణ

పెండ్లిమర్రి, అక్టోబరు 7, ప్రభాతవార్త:

మండలంలోని వెల్లటూరులో ఆదివారం రాత్రి చోరీ జరిగిందని సూపర్‌వైజర్ సోమశేఖర్‌రెడ్డి ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని తమ సిబ్బందితో పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

## కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు

కడప లీగల్, అక్టోబరు 7, ప్రభాతవార్త:
కడప నగరంలోని పురుషుల, మహిళల కేంద్ర కారాగారాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించినట్లు సీనియర్ సివిల్ జడ్జీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబాఫకృద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం, న్యా రక్షణ సలహా వ్యవస్థ, పారా వాలంటీర్లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలిపారు. మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మందులు సక్రమంగా వాడాలన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ సపూరింటెండెంట్ ఆఫ్ ప్రిజం జవహర్‌బాబు, రమేష్‌బాబు, వైద్యాధికారి వినయ్‌బాబు, మహిళా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ కృష్ణవేణి, పారా లీగల్ వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.

## జమిలి ఎన్నికల ఆచరణ సాధ్యం కాదు

వేంపల్లె, అక్టోబరు 7, ప్రభాతవార్త ః

దేశంలో జమిలి ఎన్నికల ఆచరణ సాధ్యం కాదని, పిచ్చితుగ్లక్ నిర్ణయం అని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోక్‌సభకు, అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీకు, స్థానిక ప్రభుత్వాలకు దేశ వ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించాలని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అనవసరం అన్నారు. ఇది జరగాలంటే 18 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉందన్నారు. రాజ్యాంగ సవరణ చేయాలంటే లోక్‌సభలో, రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజార్టీ ఉండాలన్నారు. అటు లోక్‌సభలోను, ఇటు రాజ్యసభలోను ఎన్డీఏ ప్రభుత్వానికి బలం లేనందున జమిలి ఎన్నికలు అసాధ్యం అన్నారు. జమిలి ఎన్నికలు అవినీతికి, నియంతృత్వానికి దారి తీస్తాయన్నారు. ఇప్పటికైనా జమిలి ఎన్నికల నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం విరమించుకోవాలని తులసిరెడ్డి తెలిపారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి



తంబళ్లపల్లె, అక్టోబరు 7, ప్రభాతవార్త:
తంబళ్లపల్లె మండలంలోని రైతుల రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి తహసీల్దారు వర ప్రసాద్‌ను కోరారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి మాట్లాడుతూ గత వైకాపా అవినీతి పాలనలో రైతులు తమ సమస్యల కోసం వందలాదిగా ఇచ్చిన అర్జీలు బుట్టదాఖలయ్యాయని రెవెన్యూ సమస్యను భ్రష్టు పట్టించారని ఇప్పటికైనా మీరు సమస్యలను కూలంకషంగా విచారణతో అధ్యయనం చేసి రైతులు, కక్షిదారులకు న్యాయం చేయాలని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారానికి ముందు ఉంటానని ఎలాంటి బేదాభిప్రాయాలు లేవని తెలపడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కొండ్రెడ్డి వెంట తాతిరెడ్డి, చంద్రశేఖర్, దళితవాడ రెడ్డప్ప అనుచరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోను సన్మానించిన టీడీపీ నాయకులు



తంబళ్లపల్లె, అక్టోబరు 7, ప్రభాతవార్త:
తంబళ్లపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉపేంద్రరెడ్డిని స్థానిక టీడీపీ, కూటమి నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం ఉదయం టీడీపీ రాజంపేట పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి సోమశేఖర్, అన్నగారిపల్లి బాలాజీ, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, సామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, సాంబశివారెడ్డి, కూటమి నాయకుడు ముద్దలదొడ్డి శంకర్‌రెడ్డి, చిన్నరెడ్డి, ఆదిరెడ్డి, వికలాంగుల సంఘం అధ్యక్షుడు రామాంజులు, తెలుగు యువత కార్యదర్శి మల్లికార్జున, శంకర్‌రెడ్డి, తెదేపా, కూటమి నాయకులు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డిని సన్మానించి స్వాగతించారు. ఎంపీడీవో టీడీపీ నాయకులను అభినందించి మండల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

## రైతు సేవా కేంద్రంలో శనగల రిజిస్ట్రేషన్ ప్రక్రియ




పెండ్లిమర్రి, అక్టోబరు 7, ప్రభాతవార్త:
మండలంలోని పెండ్లిమర్రి రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులు శనగల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వీహెచ్‌ఏ వసంత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ శనగల కోసం నమోదు చేసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎకరాకు 2 ప్యాకెట్ల చొప్పున ఒక్కో ప్యాకెట్ రూ.1410 చెల్లించాలన్నారు. పాసుపుస్తకం, సెల్ నెంబరు కచ్చితంగా తెచ్చుకోవాలన్నారు.

## తంబళ్లపల్లెలో 4226 ఇళ్లు పూర్తి చేశాం

తంబళ్లపల్లె, అక్టోబరు 7, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె నియోజకవర్గంలో హౌసింగ్ స్కీం కింద 12947 పక్కా గృహాలు మంజూరు కాగా అందులో 8721 ఇళ్లు పలు దశల్లో నిర్మాణం జరుగుతోందని 4226 పూర్తి కాగా 113 ఇళ్లు ప్రారంభం కాలేదని హౌసింగ్ ఇన్‌ఛార్జి డీఈ వెంకట్‌రెడ్డి తెలిపారు మన ఇల్లు-మన గౌరవం గ్రామ సభల ద్వారా పక్కా ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు, బిల్లుల చెల్లింపులు, లేఅవుట్ సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. లబ్ధిదారుల పాత బకాయిలు చెల్లింపులు, ఇళ్లకు సంబంధించిన ఇసుక రీచ్ ఏర్పాటుపై ఉన్నతాధికారుల సైచనలతో ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట ఏఈ సుజాత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శేషాద్రి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రైతు పక్షపాతి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి కతజ్ఞతలు

పీలేరు, అక్టోబరు 07 ప్రభాతవార్తః
జిల్లాలో ప్రతి ఏటా దాదాపు లక్ష హెక్టార్లలో వేరుసెనగ సాగు అవడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం అతివష్టి లేక అనావష్టి వల్ల రైతులు పంట నాణ్యతను లేక దిగుబడిని కోల్పోతున్నారు. ఈసంవత్సరం కూడా ఆశాజనకంగా వర్షాలు పడకపోవడం వలన వేరుసెనగ పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగింది. ప్రభుత్వం 9500 క్వింటాళ్ల ఉలవలను అన్నమయ్య జిల్లాకు కేటాయించడం జరిగింది. క్షేత్రస్థాయిలో అన్నమయ్య జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మరియు ఈసంవత్సరం వేరుసెనగ పంట నష్ట తీవ్రతను గుర్తించిన అన్నమయ్య జిల్లా వాసి, రాష్ట్ర క్రీడా యువజన రవాణా శాఖామంత్రి వర్యులు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ప్రభుత్వ అధికారులతో మాట్లాడి జిల్లాకు అదనంగా 6వేల క్వింటాళ్ల ఉలవలను తెప్పించడం సంతోషదాయకమని జిల్లాలోని రైతుల తరఫున పీలేరు ప్రకతి వ్యవసాయ నిపుణులు బోదేషావలి ఆయనకు కతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.

## ఇరిగేషన్ డీఈఈగా బాధ్యతలు స్వీకరించిన శావలా నాయక్

పీలేరు, అక్టోబరు 07 ప్రభాతవార్తః
నీటిపారుదల శాఖ పీలేరు డివిజన్ డీఈఈగా ఎం. శావలానాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో డీఈఈగా పనిచేస్తూ ఆయన పీలేరుకు బదిలీపై వచ్చారు. పీలేరులో ఇరిగేషన్ శాఖ డీఈఈగా పనిచేస్తున్న ప్రసన్నకుమారి సత్యసాయి జిల్లా కదిరికి ఇరిగేషన్ శాఖ డీఈఈగా బదిలీ అయ్యారు. ఈసందర్భంగా శావలానాయక్ మాట్లాడుతూ పీలేరు ఇరిగేషన్ డివిజన్‌స్థాయి సమస్యలను తన సిబ్బంది సహకారంతో పరిష్కరించడానికి కషిచేస్తానని అన్నారు.

## శ్రీ లలితా త్రిపుర సుందరిదేవి అలంకారంలో...

లక్కిరెడ్డిపల్లె, అక్టోబర్ 07, ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని విశ్వభారతి స్కూల్ సమీపంలో వెలసిన సర్వమంగళదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు శ్రీ లలితాత్రిపుర సుందరి దేవిగా అమ్మవారిని ప్రధాన అర్చకులు శ్రీహరిస్వామి అలంకరించారు. ఈ సందర్భంగా కుంకుమార్చనలు, మంగళ హారతుల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులేశ్వరమ్మ, ఆలయ ధర్మకర్తలు గొర్ల మోహన్‌రెడ్డి, భూదేవమ్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వో బాధ్యతలు స్వీకరించిన వరద కిషోర్ రెడ్డి

ముద్దనూరు, అక్టోబర్ 07, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలోని తాసిల్దార్ కార్యాలయం నందు సాధారణ బదిలీలో భాగంగా ఎన్ఫోర్స్‌మెంట్ డీటీగా విధులు నిర్వహిస్తున్న వరద కిషోర్ రెడ్డిని ముద్దనూరు డిప్యూటి తాసిల్దార్‌గా కడప జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశాల మేరకు బదిలీ అయ్యారు. సోమవారం నాడు బాధ్యతలు స్వీకరించి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు అదనంగా ఎమ్మార్వోగా బాధ్యతలను స్వీకరించినట్లు తెలిపారు. గతంలో ఎమ్మార్వోగా బాధ్యతలను స్వీకరించినట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని రైతులకు భూ యాజమానులు ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని ప్రజలందరికి అందుబాటులో ఉంటానని ప్రజలు, నాయకులు, రైతులు తమకు సహకరించాలని కోరారు.

## వామికొండ రిజర్వాయర్‌కు పంట కాలువలు ఏర్పాటు చేయాలి



యర్రగుంట్ల, అక్టోబర్ 07, ప్రభాతవార్త:
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో వామి కొండ రిజర్వాయర్‌కు పంట కాలువలు నిర్మించాలని కోరుతూ 9వ తేదిన చిలమకూరు బ్రహ్మంగారి గుడి వద్ద సదస్సు ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కడప జిల్లా సమితి అధ్యక్షులు గాలి చంద్ర, అలాగే రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, కాంగ్రేస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు ఇల్లూరి కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ తదితరులు హాజరవుతున్నారు. గత 8సంవత్సరాల నుండి వామి కొండ రిజర్వాయర్ కింద పంట కాలువలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఈ సదస్సు జరుగుతున్నదని అన్నారు. కావున రైతులు పెద్ద ఎత్తున హాజరై సదస్సులను జయప్రదం చేయడం ద్వారా ప్రభుత్వం నుండి సరైన సమాధానం రాబట్టేందుకు వీలు ఉంటుందని ఆ దిశగా రైతాంగం సదస్సుకు హాజరు కావలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ నాయకులు గొర్రె ఓబయ్య, ఏసన్న బాబు తదితరులు పాల్గొన్నారు. సదస్సు కరపత్రాలు స్థానిక సీపీఐ కార్యాలయంలో విడుదల చేయడం జరిగింది.

## ఆర్టీపీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి



యర్రగుంట్ల, అక్టోబర్ 07, ప్రభాతవార్త:
ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఆర్టీపిపికి వచ్చిన ఏపి జెన్‌కో డైరెక్టర్(థర్మల్) అశోకుమార్ రెడ్డికి ఏపి ఎలక్ట్రిసిటి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస సుబ్బిరెడ్డి ఆర్టీపిపి రీజనల్ యూనియన్ అధ్యక్షుడు వి.గంగయ్య, కార్యదర్శి డి. పుల్లారెడ్డిలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆర్టీపిపి అతిధి గృహంలో డైరెక్టర్ కలిసిన నాయకులు కార్మికుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు వెన్నపూస సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీపసీపీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల్లో అనేకమంది ఐటిఐ, డిగ్రీ, డిప్లొమో తదితర విద్యార్హతలు ఉన్న అన్ స్కిల్డ్ వేతనాలు ఇస్తున్నారని అన్నారు. ఏపీ ట్రాన్స్‌కోలో మాత్రమూ ఐటిఐ ఉన్న కార్మికులకు స్కిల్డ్ వేతనాలు ఇస్తున్నారని కానీ ఏపి జెన్‌కోలో విధ్యార్హతలు ఉన్న అన్ స్కిల్డ్‌గా తక్కువ వేతనాలు ఇవ్వడం అన్యాయమని ఆవేదనను వ్యక్తం చేశారు. ఒకే విద్యుత్ సంస్థల్లో జెన్‌కో లో ఒకలా ట్రాన్స్‌కోలో ఒకలా పక్షపాతముతో వేతనాలు ఇవ్వడం అన్యాయమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు 10 నుండి 20ఏళ్లుగా ఎలాంటి గ్రేడ్ మార్పుకు జరగలేదన్నారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నందున కార్మికులకు గ్రేడ్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు 2022 ఏప్రిల్ నుండి వేతనాలు పెంపుదల చేయాల్సి ఉండగా 2023 ఆగస్టు నుండి వేతనాలు పెంచారని 16మాసాల పీ.ఆర్.సి అరియర్స్ కూడ చెల్లించాలని కోరుతున్నామన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు విడతల వారీగా అరియర్స్ బకాయిలు చెల్లిస్తున్నారని కానీ తక్కువ వేతనాలు పొందుతున్న కాంట్రాక్ట్ కార్మికులకు అరియర్స్ ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. కార్మికులకు కూడ అరియర్స్ ఇవ్వాల్సిందేనన్నారు. పది సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న కార్మికులకు ఇచ్చే సర్వీస్ ఇన్సెంటివ్‌ను 2023 ఆగస్టు తొలగించారని సర్వీస్ ఇన్సెంటివ్‌ను పునరుద్దరించాలని కోరుతున్నామన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు.

## గాయపడిన వ్యక్తిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

యర్రగుంట్ల, అక్టోబర్ 07, ప్రభాతవార్త:

యర్రగుంట్ల మండల పరిధిలోని హనుమాన గుత్తి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన వర్గపోరులో గాయపడిన వైసీపీ కార్యకర్త వెంకట రాముడిని ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే మూలె సుధీర్ రెడ్డి.

## సిద్దవటం మండల అభివృద్ధి అధికారిగా ఫణి రాజకుమారి

సిద్దవటం, అక్టోబరు 7, ప్రభాతవార్త:

సిద్దవటం మండల అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న జవహర్‌బాబు గాలివీడు మండలానికి బదిలీ కావడంతో అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి మండల అభివృద్ధి అధికారిగా ఫణి రాజకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలో సమస్యలపై కృషి చేస్తానని ముఖ్యంగా తాగునీటి సమస్య ఎక్కడైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలని గ్రామ పంచాయతీలో ఉన్న పంచాయతీ కార్యదర్శులతో ప్రజా సమస్యలు తెలుసుకొని సమస్యలు పరిష్కరించాలని ఆమె సూచించారు.

## - నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు వస్తాయి : ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి




**జమ్మలమడుగు, అక్టోబరు 7, ప్రభాతవార్త:**
జమ్మలమడుగు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి వారికి ఉన్నత స్థాయి ఉద్యోగాలు అందించడమే తమ లక్ష్యమని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జమ్మలమడుగు పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్ ఆవరణలో దేవగుడి శంకర్‌రెడ్డి సుబ్బరామిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో దాదాపు 70 కంపెనీలతో నిరుద్యోగుల కోసం మెగా జాబ్ మేళా నిర్వహించామన్నారు. ఈ జాబ్ మేళాలో పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పాలిటెక్నిక్, బీటెక్, ఎంటెక్ తదితర కోర్సులు చేసిన నిరుద్యోగ యువతకు తమకు నచ్చిన కంపెనీలో ఇంటర్వ్యూలలో పాల్గొని ఉద్యోగాలు పొందాలని తెలిపారు. జమ్మలమడుగులో నిరుద్యోగ యువకుల కోసం మెండుగా ఉద్యోగ అవకాశాలు యువకుల కోసం కల్పించడం జరిగిందన్నారు. త్వరలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీంతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు డా.రాజేష్‌రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు, బీజేపీ నాయకులు, టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## విశాలాక్షి పాహిమాం..పాహిమాం - మోహిని దేవి రక్షమాం..రక్షమాం





**రాజంపేట అర్బన్, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**
శరన్నవ రాత్రి వేడుకల్లో లోక పావని జగజ్జనని, లోకాలను ఏలే జగన్మాత నాలుగవ రోజు వివిధ రూపాలలో సోమవారం భక్తులకు దర్శణం ఇచ్చారు. స్థానిక అమ్మవారి శాలలో వాసవీ మాత మోహిని దేవిగా భక్తులకు దర్శణం ఇచ్చారు. నాలుగవ రోజు అమ్మవారి శాలలో ఆర్యవైశ్య అన్న సంతర్పణ జరిగింది. అలాగే చౌడేశ్వరి దేవి ఆలయంలో విషాలాక్షి దేవి అలంకారం భక్తులను భక్తి పారవశ్యం చేసింది. మన్నూరు ఉదయగిరి ఎల్లమ్మ దేవి ఆలయంలో గ్రామ దేవత స్కంద మాతగా దర్శణం ఇచ్చారు. ఈనెల 11న ఎల్లమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన: పట్టణ పరిధిలోని మన్నూరు శివారులో వెలసిన శ్రీశ్రీశ్రీ ఉదయగిరి ఎల్లమ్మ తల్లి సన్నిధిలో దుర్గాష్టమి రోజున అనగా 11వ తేది శుక్రవారం ఉదయం 10గంటల నుండి తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు వారి ఆధ్వర్యంలో జరిగే లక్ష కుంకుమార్చణ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి మహిళకు చీరలు పంపిణీ చేయనున్నామని ఆలయ కమిటి సోమవారం ప్రకటనలో తెలిపింది. గతంలో భక్తులు అమ్మవారిని సమర్పించిన వస్త్రాలను తిరిగి భక్తులకే ఉచితంగా పంపిణీ చేయాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని నిర్వాహకులు తెలిపారు. కనుక కుంకుమార్చన కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళామణులు పాల్గొని జయప్రదం చేసి, తీర్ధ ప్రసాదాలు, అమ్మవారి శేష వస్త్రాలను స్వీకరించవలసినదిగా వారు కోరారు. ఆలయ కమిటీ నిర్ణయం పట్ల టిటిడి హిందూ ధఋ ప్రచార పరిషత్తు జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపి బాబు, ధర్మచార్యులు గంగనపల్లి వెంకటరమణలు హర్షం వ్యక్తం చేశారు.

## సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన కోదండరామస్వామి

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 7 ప్రభాతవార్త :**
పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో వెలసిన శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో సోమవారం దసరా ఉత్సవాలను ఆలయ కమిటి అధ్యక్షులు పేర్ల జనార్ధన్ రావు, సెక్రటరీ బచ్చునాగేశ్వరరావు, ట్రెజరర్ కొండపల్లి సాయికుమార్, ఉపాధ్యక్షులు తులసి సుబ్రమణ్యంతో పాటు వివిధ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అబిషేకం, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామి వారు శ్రీ సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రత్యేక ఉభయదాతలుగా కొప్పరపు శివయ్య, సతీమణి అంజనీదేవి లతో పాటు పలువురు ఉభయదారులకు స్వామివారి సన్నిధిలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు మదళ్లపల్లె సత్యం, సగళా నాగరాజ, బ్రహ్మాందు వెంకటసుబ్బయ్య, యలకంటి సుబ్బరాయుడు, సతీష్, వల్లంకొండు సత్యనారాయణ, చాటకొండు సుబ్బారావు, కొలిశెట్టి శివప్రసాద్ రావు, పబ్బతి చక్రపాణి, తులసి సుబ్బారావు పాల్గొన్నారు.




### శ్రీ ఈశ్వరిదేవి ఆలయంలో ఘనంగా దసరా ఉత్సవాలు

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:**
బద్వేలు పట్టణంలోని మైదుకూరు రోడ్డులో వెలసిన శ్రీ ఈశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు ఆలయ పీఠాధిపతి సుబ్బరాయుడు స్వామి మరియు సి.వి.నాగేశ్వరరావు, రాజేష్‌తోపాటు పలువురి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయంగనపతిపూజ, కుంకుమార్చన, మహాచండిహోమం, మూలమంత్రంతో పాటు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకునేందుకు పట్టణ పరిసర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలతో తరలివచ్చిఅమ్మవారికి కాయకర్పూరం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటి సభ్యులు ప్రత్యేక తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.



### మహాలక్ష్మి దేవి ఆలయంలో వైభవంగా తోటోత్సవం

:శ్రీ ధాన్యలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన మహాలక్ష్మి దేవి



**బద్వేలు అర్బన్, అక్టోబర్ 7 ప్రభాతవార్త :**
దసరా ఉత్సవాలలో భాగంగా మహాలక్ష్మిదేవి ఆలయంలో సోమవారం ఆలయకమిటి అధ్యక్షులు పివిఎన్. ప్రసాద్, సెక్రటరీ కొలిశెట్టి రమేష్, ట్రెజరర్ చీదళ్ల వెంకటసుబ్బయ్యలతో పాటు పలువురు కమిటి సభ్యులు ఆధ్వర్యంలో మహాలక్ష్మిదేవి అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల ఆకులు, కూరగాయలతో వైభవంగా తోటోత్సవం కార్యక్రమాన్ని పలువురు భక్తులను ఆకట్టుకునేలా నిర్వహించారు. తోటోత్సవంలోశ్రీ ధాన్యలక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక ఉభయదాతలుగా శ్రీ సాయి వెంకటేశ్వర ట్రేడర్స్ పార్టనర్ పత్తిరాజాగారి క్రిష్ణమూర్తి, సతీమణి కళావతి, కుమారుడు వెంకట మనోజ్‌కుమార్, కుమార్తె అలేఖ్య కుటుంబ సభ్యులకు ఆలయకమిటి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు పత్తి శ్రీనివాసులు, తుమ్మలపెంట సుధాకర్, జూటూరు రవి, మాలేపాటి వెంకటసుబ్బయ్య(బీమా), కొలిశెట్టి శివప్రసాద్, మాలేపాటి సురేష్‌బాబు,సురేష్, తుమ్మలపెంట సురేష్‌బాబు,కోటా శ్రీధర్, మధు,పుల్లయ్య, వల్లంకొండు నాగరాజు, తులసి సుమంత్, కొలపర్తి హేమంత్‌గుప్తా తోపాటు పత్తి రమాదేవి, కొలిశెట్టి రుక్మిణి, అనురాధా పలువురు మహిళలు పాల్గొన్నారు.





ప్రొద్దుటూరు అమ్మవారి శాలలో శ్రీ వనవిహార్‌ని దేవి అలంకారం

## చిత్త శుద్ధితో విద్యను అభ్యసించాలి

**ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**
ప్రతి విద్యార్థి అంకిత భావం, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిదిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదని, ఈ దశలో తీసుకునే నిర్ణయాలే ఉన్నత స్థితికి చేరుస్తాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలతో కూడిన విద్య అభ్యసించాలని సూచించారు. కళాశాలలో ఉన్న అధునాతన సదుపాయాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపాల్ శారద, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రామమోహన్, హెచ్ఓడీలు గంగా భవాని, నరేష్, గౌరీ శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.






ప్రొద్దుటూరు రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయం పార్వతిదేవి

### సెక్షన్-498ఎ క్రింద అభియోగం లేకున్నా

## రుజువులుంటే నేర నిర్ధారణ!

(సెక్షన్-304బి వదిలిపెట్టిన 498ఎ పట్టేస్తుంది)
(డాక్టరు సర్టిఫికేషన్ లేకపోయినా విస్పష్ట మరణ వాంగ్మూళం చెల్లుబాటు)
- సుప్రీం కోర్టు

**బద్వేలు లీగల్, అక్టోబరు 07 ప్రభాతవార్త :**
వరకట్నం, గృహ హింస కేసులకు సంబంధించిన పలు కీలక అంశాలపై సుప్రీం కోర్టు ఇటీవల వివరణాత్మక నిర్ణయాలను ప్రకటించింది. ముఖ్యంగా ఐపిసి-304బి, 498ఎ, 306, 34 సెక్షన్‌లకు, నేర స్మృతి (సిఆర్‌పిసి) లోని 464వ సెక్షన్‌కు సుదీర్ఘ వివరణలు కూడా ఇచ్చిన వరకట్నం కోసం చేసిన డిమాండ్‌కు గృహిణి మరణానికి (సెక్షన్-304బి) మధ్య ప్రత్యక్ష సంబంధం నిగ్గుతేలక పోయినా నేరానికి సంబంధించిన గట్టి రుజువులు, సాక్ష్యాధారాలు వుంటే చాలని నిందితుడిపై నేర నిర్ధారణ చేయవచ్చునని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సెక్షన్ 304బి క్రింద నిందితుడిని నిర్దోషిగా ప్రకటించినా, గృహ హింస నిరోధక చట్టంగా భావించే సెక్షన్ 498ఎ ప్రకారం నేరారోపణను ధృవీకరించవచ్చునని సుప్రీం కోర్టు ధర్మాసనం ఇటీవలే ఓ కేసులో తేల్చిచెప్పింది. సెక్షన్ 498ఎ చట్టం విస్తృతమైన పరిధే ఇందుకు కారణమని సర్వోన్నత న్యాయస్థాన ధర్మాసనం విశ్లేషించింది. వరకట్న డిమాండ్‌తో అత్తింటివారు పాల్పడినా, శారీరక, మానసిక వేధింపులతో ఓ వివాహిత ఆత్మాహుతికి పాల్పడిన హృదయ విధారక కేసుపై సుప్రీం కోర్టు ఇటీవలే ఈ తీర్పు చెప్పింది. కేసులో యిమిడి వున్న భారత శిక్షాస్మృతి (ఐపిసి) సెక్షన్‌లకు సంబంధించిన పలు మౌళిక అంశాలను విస్పష్టంగా వివరించింది. ఐపిసిలోని 306 వ సెక్షన్ (ఆత్మహత్యకు ప్రేరేపణ), సెక్షన్ 498ఎ (వివాహితపై క్రూరత్వం), సెక్షన్ 34 (అనేక మంది కలిసి ఒకే లక్ష్యంతో నేరపూరిత క్రియలో పాల్గొనడం, 304బి (వరకట్న హత్యా నేరం)ల నిర్ధారణ వంటి సెక్షన్‌ల అన్వయంపై సవివరంగా సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఒకవేళ ఐపిసి సెక్షన్ 304బి క్రింద నిందితులు తప్పించుకోగలిగినా అలాంటి వారిని విస్తృత పరిధి కలిగిన ఐపిసి సెక్షన్ 498ఎ వదిలిపెట్టబోదని స్పష్టం చేసింది. సాధికారికంగా రికార్డు చేసిన బాధితురాలి విస్పష్ట మరణ వాంగ్మూళం పూర్తిగా చెల్లుబాటు అవుతుందని, ఇందుకు డాక్టర్ సర్టిఫికేషన్ లేకపోయినా పరువాలేదని జస్టిస్ రవీంద్రభట్, జస్టిస్ అరవింద కుమార్ లతో కూడా సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొనింది (క్రిమినల్ అప్పీల్ నెం. ఆఫ్ 2023) స్పెషల్ లీవ్ పిటీషన్ (సిఆర్‌ఎల్) నెం.12216 ఆఫ్ 2022 ప్యారాన్ గౌడ అండ్ అనదర్ వర్సెస్ ది స్టేట్ ఆఫ్ కర్ణాటక అండ్ అనదర్ 2023 ఐఎన్ఎస్‌సి 9331. మరణ వాంగ్మూళం ఆమోద యోగ్యతకు సంబంధించిన న్యాయ సిద్ధాంతం ఏమిటంటే అది అంతిమంగా చేస్తున్న ప్రకటన. మరణ దశలో ఉన్నప్పుడు ఈ జగత్తులోని ప్రతి ఆశ ఆవిరైపోయి అసత్యం వైపు మొగ్గుచూపే ప్రతి భావన ఉడిగిపోయినపుడు మనిషి సత్యాన్ని మాత్రమే మాట్లాడుతాడనేది బలంగా విశ్వసించే సిద్ధాంతం. విషయం ఇదే అయినప్పటికీ సత్యాన్ని ప్రభావితం చేసే ఎన్నెన్నో పరిస్థితుల కారణంగా వెల్లడయ్యే సాక్ష్యాధారాలకు ఇవ్వాల్సిన ప్రాముఖ్యం విషయంలో చాలా జాగ్రత్త అవసరము. ఒక మనిషి మరణశయ్యపై ఉన్నా పరిస్థితి చాలా గంభీరంగా, పరమ పవిత్రంగా, నిర్మళంగా ఉంటుంది. ఆ వ్యక్తి వాంగ్మూళం ప్రామాణికతను, వాస్తవికతను అంగీకరించడానికి చట్టం యొక్క కారణం ఇదేనని సుప్రీం కోర్టు సవివరంగా వ్యాఖ్యానించింది. మరణ క్షణానికి ముందుగా (వెరీ నియర్ టు డెత్) అనే పదానికి కూడా ఈ సందర్భంగా ధర్మాసనం వివరణ ఇచ్చింది. షేర్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హర్యాణ (2015) 1.(ఎస్‌సిఆర్ 29) కేసును ప్రస్తావించింది, మరణానికి (మరణ క్షణానికి) "అత్యంత ముందుగా" అనే వాఖ్యాన్ని రోజులు, నెలలు, సంవత్సరాలు అనే అర్థంలో చూడరాదని పేర్కొంది. "వరకట్నం డిమాండ్ అనేది గతించిపోయిన సంఘటన కాదని సెక్షన్ 304బి క్రింద మరణానికి లేదా సెక్షన్ 306 క్రింద ఆత్మహత్యకు పురికొల్పడానికి గల నిత్య నిరంతర కారణమనే సూచనగా గ్రహించాలి." అని కూడా ధర్మాసనం సవివరంగా పేర్కొంది.

### శరన్నవరాత్రుల్లో భాగంగా...



**మైదుకూరు, అక్టోబర్ 07,ప్రభాతవవార్త :**
మండల కేంద్రంలోని మైదుకూరు పట్టణ కేంద్రంలో దశరా శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి అలంకారం (తోటోత్సవం) లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి శాలలో సోమవారం కన్యకా పరమేశ్వరి దేవి మూలవిరాట్ కు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారి ఆయలానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

### గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవవారు



**చెన్నూరు,అక్టోబర్07,ప్రభాతవవార్త :**
మండలంలోని రామలింగ చౌడేశ్వరి దేవస్థానం నందు శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలలో భాగంగా భక్తులు అమ్మవారికి దర్శించుకునేందుకు ఎక్కువగా రావడం జరిగింది. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలను ఆలయ సిబ్బంది ఏర్పాటు చేయడం జరిగింది. ఆయలానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాధాలు అందజేశారు.

### ఇస్రో స్పేస్ వీక్

**కడప, అక్టోబర్ 07, ప్రభాతవార్త:**
కేయస్ఆర్ఎం, ఇస్రో సంయుక్తంగా ఈ నెల 7వ తేది నుంచి 9వరకు కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో వరల్డ్ స్పేస్ వీక్-2024 కార్యక్రమలో భాగంగా స్పేస్-వెదర్ చేంజ్ అనే థీమ్‌తో అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా షార్ డైరెక్టర్ రమేష్ బాబు గారు, శ్రీ ఎస్ఎస్ మురళీ, జోనల్ ఆఫీసర్ ఏపీపీజి హాజరయ్యారు. ఎలాంటి స్పేస్ వీక్ ఎగ్జిబిషన్ వల్ల పిల్లలకు సృజనాత్మక ఆలోచనలు ఉద్భవించే అవకాశం ఉంటుందని, దీంతో పాటు వారి ఆలోచన విధానం పరిశోధన వైపు అడుగులు వేయడం సాధ్యం అవుతుంది అన్నారు. కార్యక్రమంలో భాగంగా సైన్స్ ఎగ్జిబిషన్, ఎలక్యూషన్, ఎస్సే రైటింగ్, షార్ట్ ఫిల్మ్, సైన్స్ మోడల్‌సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివే విద్యార్థుల వరకు అందరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ స్కూల్స్ మరియు కాలేజెస్ నుంచి 2000మందికి పైగా ఇస్రో ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం 25మంది ఇస్రో సైంటిస్టులు సహాయసకరలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ టీ.ఎన్ ప్రసాద్, కల్చరల్ క్లబ్ కోఆర్డినేట్ డాక్టర్ వీర శంకర్, కాలేజ్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేట్ సురేష్ బాబు మరియు కమిటి మెంబర్స్ పాల్గొన్నారు.

